క్లుప్తంగా

ఫైలేరియాపై మలేరియా సిబ్బందికి శిక్షణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫైలేరియాస్ వ్యాధికి సంబంధించి మలేరియా విభాగంలో పనిచేస్తున్న సబ్‌యూనిట్ అధికారులు, ఎంపీహెచ్‌ఎస్‌కి శనివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. లబ్బీపేటలోని జిల్లా మలేరియా కార్యాలయంలో డీఎంఓ డాక్టర్ మోతీబాబు అధ్యక్షతన జరిగిన శిక్షణలో రాష్ట్ర ఫైలేరియా ప్రతినిధి శ్రీహరివెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. ఫైలేరియా కేసుపై భౌతిక ప్రదర్శనతో పాటు గ్రేడింగ్, చికిత్స, వైకల్య నివారణ, కిట్ వాడకం, రాత్రి రక్తపూతలు పరీక్ష, చికిత్సలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

'ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం'



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో పి.చంద్రశేఖర్ ఆలయ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఏఈవో మాట్లాడుతూ.. ఇంద్రకీలాద్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడంతో పాటు ఆలయ పరిసరాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆలయ అధికారులు, సిబ్బంది చీపుర్లు పట్టి ఆలయ సేవలో పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్ల జోళ్ల పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులకు కళ్ల జోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న 500 మంది విద్యార్థులకు మాక్సివిజన్ హాస్పిటల్ సహకారంతో గత నెలలో కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 74 మందిలో దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ నగర అధ్యక్షురాలు డాక్టర్ వి.శ్రీదేవి విద్యార్థులకు కళ్ల జోళ్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. కంటి చూపులో తేడా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలన్నారు. నిర్లక్ష్యంతో అశ్రద్ధ వహిస్తే భవిష్యత్ అంధకారం అవుతుందని చెప్పారు. విద్యార్థులకు కళ్ల జోళ్లు అందించిన రోటరీ క్లబ్ సభ్యులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాతంగి కోటయ్య ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు డీవీ మురళీ ప్రసాద్ పాల్గొన్నారు.

భవానీపురంలోని ఓ ఇంట్లో చోరీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గతేడాది అక్టోబర్‌లో ఓ ఇంట్లో జరిగిన చోరీపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. మద్దుల శ్రీనివాసరావు అనే వ్యక్తి భవానీపురం పోలీసు కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. అయోధ్యనగర్‌లో షాపు పెట్టుకొని డిస్ట్రిబ్యూటర్‌గా పని చేస్తున్నాడు. గతేడాది అక్టోబర్‌లో శ్రీనివాసరావు భార్య బెంగళూరులో ఉంటున్న వారి కూతురు వద్దకు వెళ్లింది. అక్టోబర్ 28న శ్రీనివాసరావు ఇంటికి తాళం వేసి బైక్‌పై షాపు వద్దకు వెళ్లాడు. బైక్ తాళం బైక్‌కే వదిలేసి షాపులోనికి వెళ్లి... కొద్దిసేపటి తర్వాత వచ్చి చూడగా బైక్ తాళం దానితో కలిసి ఉన్న ఇంటి తాళం కనిపించలేదు. ఆటోలో ఇంటికి వెళ్లి ఓనర్ వద్ద ఉన్న మరో తాళంతో తలుపులు తెరిచాడు. తర్వాత రోజు చూడగా కప్ బోర్డులో నగదు, బీరువాలోని బంగారం, వెండి నగలు కనిపించలేదు. 150 గ్రాముల బంగారు వస్తువులు అపహరించబడ్డాయి. ఆ తర్వాత రోజు శ్రీనివాసరావు బైక్‌పై నుంచి పడి గాయపడి ఆస్పత్రిలో చేరాడు. కోలుకున్న తర్వాత శనివారం భవానీపురం పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కచ్చా డ్రెయిన్ల కష్టాలు

ఇంకెన్నాళ్లు ?

- కోతకు గురవుతున్న కాలువ అంచులు
- ఖాళీ స్థలాల్లోకి వెళ్లిపోతున్న మురుగు నీరు
- ఇళ్లల్లోకి వస్తున్న విష పురుగులు
- భారీ వర్షం కురిస్తే అంతా ఏకమే
- చోద్యం చూస్తున్న వీఎంసీ అధికారులు



ఊర్మిళానగర్ మెయిన్ రోడ్ పక్కన కచ్చా డ్రెయిన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలోని గట్టు వెనుక ప్రాంతంలో కచ్చా డ్రెయిన్లు బెంబేలెత్తిస్తున్నాయి. డ్రెయిన్ల కారణంగా కాలువ అంచులు(రోడ్లు) కోతకు గురవుతున్నాయి. దీంతో ఆయా రోడ్లు కుచించుకుపోతున్నాయి. రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారులు లేకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతే కాకుండా కచ్చా డ్రెయిన్లు ప్రమాదకరంగా తయారవుతున్నాయి. ఎదురు లేదా వెనుక నుంచో వచ్చే వాహనాలను తప్పించుకునే క్రమంలో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి డ్రెయిన్‌లోకి దూసుకుపోతున్నాయి. ముఖ్యంగా పాదచారులు కాలువలో పడిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. డ్రెయిన్‌లోని మురుగు నీరు పారుదలకు హద్దు అంటూ లేకపోవడంతో అవి ఎలా పడితే అలా వెళుతుండటంతో అంచులు కోతకు గురయ్యి రోడ్లు కుచించుకుపోవడం, డ్రెయిన్ పొడవునా పక్కనే ఉన్న ప్రదేశం మెత్తబడి ఆదమరిచి కాలు వేస్తే దిగబడిపోతుంది. నగరపాలక సంస్థ కమిషనర్‌తో సహా అధికారులు కచ్చా డ్రెయిన్లు ఉన్న ప్రాంతాల్లో పర్యటిస్తూనే ఉంటారు. అయినా చూస్తూ వెళ్లిపోతారు తప్పితే వాటి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రజలు వినతులు, విజ్ఞప్తులు చేస్తున్నా అలాగా.. సరే చూస్తాం అంటూ చెప్పి తప్పించుకుంటున్నారని, వాటిపై దృష్టి పెట్టిన పాపాన పోవటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

వర్షం వస్తే రోడ్డు, డ్రెయిన్ అంతా ఏకమే



కబేళా మెయిన్ రోడ్‌లో కచ్చా డ్రెయిన్

భారీ వర్షం కురిస్తే కచ్చా డ్రెయిన్ నిండిపోయి ఆ మురుగు నీరు రోడ్డుపై ప్రవహించి అంతా ఏకమైపోతుంది. అప్పుడు డ్రెయిన్ ఎక్కడ ఉందో కూడా కనిపించని పరిస్థితి. అటువంటి సమయాల్లో పొంగి పొర్లే డ్రెయిన్లలోని మురుగు నీటిలో నుంచి వచ్చే విషపు పురుగులు ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయి(ఇంటి వాడకం నీరు బయటకు పోయేందుకు ఏర్పాటు చేసుకునే అవుట్‌లెట్ల ద్వారా). సుమారు ఆరేళ్ల క్రితం ఊర్మిళానగర్‌లో ఒక బాలుడు విష పురుగు కుట్టడం వలన చనిపోయాడు. అదే సిమెంట్‌తో నిర్మించిన పక్కా డ్రెయిన్ అయితే మురుగు నీటి పారుదలకు కట్టడి ఉండి ఆ మార్గంలోనే ముందుకు సాగుతుంది. ఇంక తుఫాన్లు, వరద వస్తే చెప్పే పనే లేదు. ఇటీవల సంభవించిన బుడమేరు వరద అందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తుంది. ఒక ప్రణాళిక ప్రకారం కచ్చా డ్రెయిన్‌లో పూడిక తీయక పోవడం కూడా మురుగు నీరు ముందుకు వెళ్లకపోవడానికి ఒక కారణంగా చెప్పవచ్చు. తద్వారా వరుసగా రెండు రోజుల పాటు వర్షం కురిసినా అది నిండిపోయి పొంగి పొర్లుతున్నాయి.

పక్కా డ్రెయిన్లు నిర్మించాలి..

భవానీపురం చర్చి సెంటర్ నుంచి ఊర్మిళానగర వెళ్లే రోడ్‌లో కుడి వైపు కొంత మేర మాత్రమే పక్కా డ్రెయిన్ ఉండగా రామాలయం దగ్గర నుంచి చివరి వరకు కచ్చా డ్రెయిన్ ఉంది. స్థానిక క్రాంబ్వే రోడ్‌లోని అవుట్‌ఫాల్ డ్రెయిన్ నుంచి, అలాగే జోజినగర్ రోడ్డులోని అవుట్‌ఫాల్ డ్రెయిన్ నుంచి వచ్చే మురుగు నీరంతా ఊర్మిళానగర్ చివర ఉన్న కల్వర్ట్ దగ్గరకు చేరుకుంటుంది. అక్కడ కూడా పక్కా నిర్మాణం లేకపోవడంతో రోడ్డు కోసుకుపోయింది. అదే విధంగా విద్యాధరపురం సితార జంక్షన్ నుంచి ఉన్న పక్కా అవుట్‌ఫాల్ డ్రెయిన్ ద్వారా వచ్చే మురుగు నీరు కబేళా సెంటర్‌లోని కల్వర్ట్ దగ్గరకు వస్తుంది. అక్కడ నుంచి రామరాజ్యనగర్ వైపు(సీవీఆర్ ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు) వెళ్లే కచ్చా డ్రెయిన్‌గా మిగిలిపోయింది. నిత్యం రద్దీగా ఉండే కబేళా సెంటర్‌లో కచ్చా డ్రెయిన్ కారణంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అలాగే కబేళా రోడ్డులోని జెఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయం వద్ద మాత్రమే చిన్నపాటి కాలువ నిర్మించారు. మిగతా రహదారి మొత్తం కచ్చా డ్రెయినే. కచ్చా డ్రెయిన్ల స్థానంలో సీసీ పక్కా డ్రెయిన్లను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



కబేళా సెంటర్ నుంచి ఆర్ఆర్‌నగర్ వెళ్లే మార్గంలో..

కొనసాగుతున్న అగ్ని మాపక వారోత్సవాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని కొత్తపేట అగ్నిమాపక అధికారి తలశిల శ్రీనివాసరావు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని షేక్ రాజా హాస్పిటల్, శ్రీయాస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శనివారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అనుకోని రీతిలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ప్రాణనష్టం, ఆస్తినష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు పాటించి మంటలను అదుపు చేయాలన్నారు. ఇందు కోసం అందుబాటులో ఉన్న అగ్నిమాపక పరికరాల గురించి ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన ఉండాలని చెప్పారు. ముఖ్యంగా బహుళ అంతస్తులు, జనసంచారం అధికంగా ఉండే హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్‌లో తప్పని సరిగా మంటలను అదుపు చేసే కెమికల్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వంటగ్యాస్ లీకై మంటలు వ్యాపిస్తే, ఆందోళన చెందకుండా మంటలను అదుపు చేసే విధానాలపై సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది సీహెచ్.విజయ్‌కుమార్, ఆర్.నరేంద్ర, ఆషేరు, వి.వి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి మధుర ఫలం



బందరు రోడ్డులో విక్రయానికి ఉంచిన మామిడి పండ్లు



మామిడి పండ్లు

నగరంలో మామిడి పండ్ల సీజన్ ప్రారంభమైంది. పండ్ల రారాజైన మామిడి విక్రయాలు ఏలూరు రోడ్డు, బందరు రోడ్డుతో పాటు నగర వ్యాప్తంగా జోరందుకున్నాయి. నోరూరించే మామిడి పండ్లను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా శనివారం క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఏలూరు రోడ్డులో విక్రయిస్తున్న మామిడి పండ్లు

ఉత్సాహంగా సైన్స్ ఎక్స్‌ప్లోజర్ టూర్



సైన్స్ ఎక్స్‌ప్లోజర్ టూర్‌లో పాల్గొన్న విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు విజ్ఞాన శాస్త్రాలపై పట్టు సాధించాలని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాథమిక పాఠశాలల నుంచి 50 మంది విద్యార్థులతో సైన్స్ ఎక్స్‌ప్లోజర్ టూర్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నగరంలోని గాంధీ హిల్ ప్రాంగణంలో ఉన్న ప్లానిటోరియం, భవానీపురంలోని అప్‌కాస్ట్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం పాములకాలువ వద్ద ఉన్న బృందావన్ పార్క్‌ను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లోని సైన్స్ పరికరాలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. విజ్ఞాన శాస్త్రాలకు సంబంధించి అక్కడ ఉన్న నమూనాలు పని చేసే విధానాలపై అవగాహన పొందారు. అనంతరం డాక్టర్ మైనం హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆయా సైన్స్ అంశాలపై అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే సైన్స్ ఎక్స్‌ప్లోజర్ టూర్ తదితర కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల నుంచి 50 మంది విద్యార్థులను ఈ టూర్‌కు తీసుకెళ్లామని చెప్పారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు రాజకుమార్, ఉమాదేవి, షేక్ సైదాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణారావు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జేఈఈ మెయిన్స్ – 2025 ఫలితాల్లో గొల్లపూడిలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆలిండియా ర్యాంకులు సాధించారు. శనివారం విడుదలైన ఫలితాల్లో ఈర్ల బిందు(హాల్ టికెట్ నంబర్ : 250311058454) ఆలిండియా స్థాయిలో 142వ ర్యాంక్, సీహెచ్ షణ్ముఖ సాయి(హాల్ టికెట్ నంబర్ : 25031084300) 274వ ర్యాంక్ సాధించారని విజయవాడ జోనల్ ఇన్‌చార్జి కృష్ణారావు తెలిపారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆలిండియా ర్యాంక్‌లు సాధించిన వారిద్దరితో పాటు 11 మంది విద్యార్థులు 10 వేలలోపు ర్యాంక్‌లు సాధించారన్నారు. 53 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్(ఐఐటీ) పరీక్షలు రాయటానికి అర్హత సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎస్ఆర్ జూనియర్ కాలేజీస్ ఏపీ జనరల్ మేనేజర్ రాజేంద్రప్రసాద్, ఏపీ డీజీఎం రమణ, అకడమిక కోర్ డీన్ అరవింద్, విజయవాడ అకడమిక్ డీన్ శంకరరావు, జోనల్ ఇన్‌చార్జి మహేంద్రరెడ్డి, బ్రాంచ్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ఉత్తమ ర్యాంకర్లకు అభినందన



విజేతలతో ఉపాధ్యాయులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మానవ జీవితం సైన్స్‌తోనే ముడిపడి ఉందని, మానవుల స్థితిగతులను మార్చేది కూడా సైన్సేనని కేబీఎన్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ అన్నారు. భవానీపురం శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్(ఐఎన్‌టీఎస్ఓ) సెకండ్ లెవెల్ పరీక్షలో పాల్గొని ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన సందర్భంగా శనివారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయకుమార్ మాట్లాడుతూ.. ఇండియా స్థాయిలో పోటీ పరీక్షల్లో పాల్గొనేందుకు మానసిక స్థైర్యం కావాలని, ఆ దిశగా దూసుకువెళ్లటమే కాకుండా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు అభినందనీయులన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సత్యచిత్ర మాట్లాడుతూ శ్రీచైతన్య కరిక్యులమ్ విద్యార్థుల పరిధికి మించి ఆలోచించేలా ప్రోత్సహిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో శ్రీచైతన్య ఈజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ వినోద్, కో ఆర్డినేటర్ చక్రధర ప్రసాద్, డీన్ రంగారావు, సీ బ్యాచ్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఆకాష్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో అకడమిక్ హెడ్ ధీరజ్‌కుమార్ మిశ్రా

లబ్బీపేట(విజయవాడతూర్పు): జేఈఈ మెయిన్స్‌లో ఆకాష్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ విద్యార్థులు నలుగురు 99 శాతం అంతకంటే ఎక్కువ మార్కులు సాధించినట్లు అకడమిక్ హెడ్ ధీరజ్‌కుమార్ మిశ్రా తెలిపారు. విజయవాడలోని తమ క్యాంపస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు మధుసూదన రెడ్డి యేరువ 99.89 శాతం, ఉజ్వల్ బపన్న డోరపాడల 99.56 శాతం, నిదీష్ యేమిని 99.54 శాతం, నితీష్ సుంకర 99.33 శాతం మార్కులు సాధించారన్నారు. ఈ ఫలితాలు విద్యార్థుల దృఢ సంకల్పం, అకడమిక్ అద్భుతతను ప్రదర్శిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ విజయానికి తాము గర్వపడుతున్నామని చెప్పారు.

స్పోర్ట్స్ రిజర్వేషన్ పెంపుపై హర్షం

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రంలో క్రీడాకారుల ప్రయోజనాలను కాంక్షిస్తూ స్పోర్ట్స్ రిజర్వేషన్ 2 నుంచి 3 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడంపై ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో 29 క్రీడలకు మాత్రమే స్పోర్ట్స్ రిజర్వేషన్ వర్తించేదని, 3శాతం అమలుతో 65 క్రీడలకు రిజర్వేషన్ వర్తిస్తుందని ప్రకటించారు.

ఏ, బీ కేటగిరీలుగా విభజించడం దురదృష్టకరం : కేపీ రావు

65 క్రీడలలో 36 క్రీడలను 'ఏ' కేటగిరీగా మిగిలిన క్రీడలను 'బి' కేటగిరీగా విభజిస్తూ జీవో విడుదల చేయడం దురదృష్టకరమని ఏపీ ఒలింపిక్ సంఘం కార్యదర్శి కె.పి.రావు శనివారం ఒక ప్రకటనలో అభిప్రాయం వ్యక్తం చేశారు. జీవోను సవరించాలని కె.పి.రావు ప్రభుత్వాన్ని కోరారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ అంబాపురానికి చెందిన చిల్లపల్లి లక్ష్మీప్రసన్న, చిన్నారావులు భార్యభర్తలు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. చిన్నారావు డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో అప్పులు చేసినట్లు చిన్నారావు తరచూ భార్యకు చెప్పేవాడు. ఈ నెల 17న లారీ ఆఫీసుకు వెళ్లి వస్తానని బైక్‌పై బయటకు వెళ్లాడు. 18వ తేదీ ఉదయం చిన్నారావు బైక్ వైఎస్సార్ రింగ్ వద్ద ఉన్నట్లు తెలిసిన వారు చెప్పారు. దీంతో ఆందోళన చెందిన ఆమె అక్కడకు వెళ్లగా బైక్ ఉంది. భర్తకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. ఆందోళన చెందిన లక్ష్మీప్రసన్న తన భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



ఉపాధి అవకాశాలు పొందిన విద్యార్థులతో యజమాన్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమలోని నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడు మరిన్ని అవకాశాలు లభిస్తాయని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్ సుధీర్ అన్నారు. ఆ కళాశాల ప్లేస్‌మెంట్ అండ్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ విజయోత్సవం పేరుతో వివిధ కంపెనీల్లో ప్లేస్‌మెంట్ వచ్చిన విద్యార్థుల అభినందన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అమర్‌సుధీర్ మాట్లాడుతూ.. తమ కళాశాల కేవలం విద్యాబోధనకు మాత్రమే పరిమితం కాకుండా విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు లభించే దిశగా తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యార్థులను వారివారి రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దటంతో పాటుగా ప్లేస్‌మెంట్ అవకాశాలను అందిపుచ్చుకోవటానికి అవసరమైన నైపుణ్యాలను సైతం పెంపొందించాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఈ విద్యా సంవత్సరం 350 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో జాబ్‌లను పొందారన్నారు. సుమారు 95 శాతం విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.వ తంజలిశాస్త్రి, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఎస్.మణికంఠ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జీఎస్ శ్రీనివాస మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే హాస్పిటల్‌లో ఉచిత ఫైబ్రో స్కాన్ శిబిరం



రైల్వే హాస్పిటల్‌లో వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న సీఎంఎస్ డాక్టర్ శ్రీనివాసు, సిబ్బంది

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జైడస్ లైఫ్ సైన్సెస్ సహకారంతో విజయవాడ రైల్వే హాస్పిటల్ న్యూ ఓపీడీ భవనంలోని రేడియాలజీ బ్లాక్‌లో ఉచిత ఫైబ్రో స్కాన్(లివర్) స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలేయ సంబంధిత వ్యాధులు, వాటి నివారణ, చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఊబకాయం, మద్యపానం, అధిక కొలెస్ట్రాల్, మధుమేహం, హెచ్‌బీవీ/హెచ్‌సీవీ ఇన్‌ఫెక్షన్ లక్షణాలతో బాధపడుతున్న రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. మానవ శరీరంలో కాలేయం ముఖ్యమైన అవయవమని, క్రమం తప్పకుండా వ్యాయామం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కాలేయ సంబంధిత రుగ్మతల నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఏసీఎంఎస్ డాక్టర్ జైదీప్, జైడస్ లైఫ్ సైన్సెస్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుదాం



ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రెహమతున్నీసా

భవానీపురం(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం డివిజన్ పరిధిలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ–వేస్ట్ సేకరణను ఉద్యమంలా చేపట్టి వాటిని రీ సైక్లింగ్ చేయడం ద్వారా వృథాను అరికట్టవచ్చన్నారు. పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులను బహిరంగ ప్రదేశాల్లో వేయడం ద్వారా అన్ని రకాల కాలుష్యానికి గురవుతున్నాయని చెప్పారు. తద్వారా మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపి అనేక రోగాలకు దారి తీస్తోందన్నారు. ఈ సందర్భంగా నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దడంలో తమ వంతు సహకారం అందిస్తామని ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పరిసరాలను ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉంచుకొని వ్యాధులకు దూరంగా ఉండాలని పలువురు కార్పొరేటర్లు అన్నారు. వన్‌టౌన్‌లోని 53, 51, 37 డివిజన్లలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహనా ప్రదర్శనలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీరావు, ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి) తదితరులు మాట్లాడుతూ డ్రెయిన్లలో చెత్తను వేయవద్దన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు. పరిసరాల శుభ్రతపై విద్యార్థులు చైతన్యవంతం కావాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల విద్యార్థులతో ర్యాలీలను నిర్వహించారు. కార్యక్రమాల్లో నగరపాలకసంస్థకు చెందిన శానిటరీ మేస్త్రీలు, ఇన్‌స్పెక్టర్లు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.